క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లక్ష్మీగణపతి, తట్టిఅన్నారం, టీ.ఎస్.హౌసింగ్ బోర్డు ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పాఠశాలకు బీరువాల అందజేత


బీరువాలను ప్రారంభిస్తున్న కెనరా బ్యాంక్ ఏజీఎం

కందుకూరు: మండల పరిధిలోని రాచులూరు జిల్లా పరిషత్ పాఠశాలలో రాచులూరు కెనరా బ్యాంక్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా బుధవారం రూ.30 వేల విలువ గల నాలుగు బీరువాలను అందజేసింది. ఆ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అక్షయమూర్తి ఆ బీరువాలను అందించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. చిన్నతనం నుంచే మంచి, చెడుల గురించి తెలుసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.దేవేందర్‌రెడ్డి, బ్యాంక్ మేనేజర్ కరుణాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కులగణన తీర్మానం హర్షణీయం

టీపీసీసీ కార్యదర్శి జానకీరామ్

తుక్కుగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన బీసీ కులగణన చేసి అసెంబ్లీలో ప్రవేశపెట్టడం హర్షణీయమని టీపీసీసీ కార్యదర్శి గోగికర్ జానకీరామ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ కేంద్రంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో జనాభా ధమాష ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సీట్లను కేటాయిస్తుందన్నారు. రిజర్వేషన్ల నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రభుత్వానికి పేరు వస్తుందనే అక్కసుతోనే వాకౌట్


మాట్లాడుతున్న శ్రీనివాసరావు, వంశీ

హుడాకాంప్లెక్స్: ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం సై అన్న నేపథ్యంలో బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందా లేదా తెలపకుండా కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న అక్కసుతో వాకౌట్ చేయడం దురదృష్టకరమని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు విమర్శించారు. బుధవారం సరూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలు బాగుపడడం ఇష్టం లేకే శాసనసభను బీఆర్ఎస్ బహిష్కరించిందని ఆరోపించారు. వర్గీకరణతో పాటు కీలకమైన బీసీ కులగణనపై చర్చ జరుగుతుంటే, శాసనసభకు రండీ అని ముఖ్యమంత్రి చెప్పినా కేసీఆర్ రాలేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ కులగణన చేయడమే కాక ఎస్సీ వర్గీకరణకు కూడా స్వాగతం చెప్పిందని తెలిపారు. సమావేశంలో హుజూరాబాద్ మాజీ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి విష్ణు దాస్ వంశీ పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

చేవెళ్ల: మైనర్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు తప్పవని సీఐ వెంకటేశం హెచ్చరించారు. మండల కేంద్రంలో బుధవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా నడిపిన 12 వాహనాలను, మైనర్లు నడిపిస్తున్న మూడు వాహనాలను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారికి చేవెళ్ల పోలీస్‌స్టేషన్ వద్ద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడిపించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని, వారి తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. రోడ్లపై ఇష్టం వచ్చి నట్లుగా వాహనాలు నడిపినా, ఇష్టానుసారంగా వాహనాలు నిలిపి ఇతరులకు ఇబ్బందులు కల్పించిన చర్యలు తీసుకుంటామన్నారు. వా హనాలకు సంబంధించిన అన్ని పత్రాలను వాహనదారులు కలిగి ఉండాలని చెప్పారు.

లక్ష్యం శతశాతం

ప్రభుత్వ సంక్షేమ ఫలాలను నిజమైన అర్హులకు అందజేయడంతో పాటు.. రోజువారి బాధ్యతలు నిర్వహించే అధికార యంత్రాంగం.. పన్నుల వసూలులోనూ బిజీగా ఉంటోంది. లక్ష్యం చేరుకునేందుకు తీవ్ర కసరత్తు చేస్తోంది. గడిచిన ఏడాదితో పాటు.. రానున్న ఆర్థిక సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే టార్గెట్ దిశగా పరుగులు తీస్తోంది.

- 2025- 26 పన్ను టార్గెట్ రూ.35 కోట్లు
- తీవ్ర కసరత్తు చేస్తున్న అధికారులు
- ప్రత్యేక కార్యక్రమాలతో అవగాహన కార్యక్రమాలు



బడంగ్‌పేట్ మున్సిపాలిటీ భవనం

బడంగ్‌పేట్: 2024- 25 టార్గెట్ రూ.25 కోట్లు పన్ను వసూలు అంచనా చేసుకున్న అధికారులు.. చివరకు 70 శాతానికి చేరుకున్నారు. ఈ సంవత్సరం 2025- 26 సంవత్సరానికి గాను రూ.35 కోట్లుగా లక్ష్యం పెట్టుకున్నారు. అందుకు ఫిబ్రవరి నుంచే అనుకున్న టార్గెట్ చేరుకునేందుకు అధికారులు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది టాక్సుల బుక్‌లు పట్టుకుని ఇంటింటికీ తిరుగుతున్నారు.

రెవెన్యూమేళా..

ఇంటి పన్నులు, ట్రేడ్ లైసెన్సులు, పెయిడ్ లైసెన్స్ రూపేనా టాక్స్ వసులు చేసే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. బకాయి ఇంటి పన్నుతో పాటు, ప్రస్తుతం చెల్లించాల్సి పన్ను విషయంలో ఏమైనా తప్పులు దొర్లినా సవరించుకుని, ప్రజలు ఇంటి పన్నులు చెల్లించేలా ప్రతి మంగళ, గురువారం రెవెన్యూ మేళాను అధికారులు కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. అందుకు బ్యానర్‌ను ప్రదర్శించారు. మార్చి 31 వరకు అందుబాటులో ఈ స్కీం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్-2020 పేరున హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లో వెనుకబాటు

ఇంటి పన్ను టార్గె విషయంలో అధికారులు, సిబ్బంది కొంత ఉత్సాహం చూపుతున్నారు. కానీ ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుండానే కొందరు ఓపెన్ ప్లేసుల్లో పెద్ద ప్లాట్లల్లో అక్రమ షెడ్లు వేసి, అద్దెకు ఇస్తూ లబ్ధిపొందుతున్న వారి విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కార్పొరేషన్ పరిధి 32 డివిజన్లలో ఈ తతంగం సాగుతోంది. అధికారులు అక్రమంగా వెలసిన షెడ్లను గుర్తించి, ట్రేడ్ లైసెన్సులు జారీ చేసి పన్నులు విధిస్తే కార్పొరేషన్‌కు అధిక ఆదాయం సమకూరుతుందని, ఆదిశగా అధికారులు చొరవ చూపాలని మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.

సహకరించాలి



గతేడాది కంటే ఈ సారి రూ.10 కోట్లు టార్గెట్ ఎక్కువ పెట్టుకున్నాం. 2025-26లో రూ.35 కోట్లను రాబట్టేందుకు కృషి చేస్తున్నాం. అందుకే ఫిబ్రవరి నుంచే మార్చి టార్గెట్‌ను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. సకాలంలో పన్నులు చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి ప్రజలు సహకరించాలి.

– పి.సరస్వతి, కమిషనర్, బడంగ్‌పేట్

అన్ని వర్గాలకు అనుకూలంగా బడ్జెట్

- బీజేపీ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి

కందుకూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ.. బడ్జెట్‌లో రైతులను ఆదుకునే విధంగా కేటాయింపులు జరిపారని, బడుగు, బలహీన వర్గాలు గౌరవంగా బతికేలా బడ్జెట్ కేటాయించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా నాయకుడు టి.జగదీశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు నల్లబోలు నర్సింహారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బక్క మల్లేశ్, మాజీ సర్పంచ్ గౌర ప్రభాకర్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు అంబటి యాదగిరి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు క్లేం చెన్నారెడ్డి, కృష్ణగౌడ్, కుమార్, అంబటి కృష్ణ, చెన్నయ్య, యువ మోర్చా నాయకులు వరుణ్, మామిళ్ల ప్రవీణ్, సామల దయాకర్‌రెడ్డి, మల్లేశ్, శ్రీశైలం, ప్రవీణ్, ఆంజనేయులు, నర్సింహ, పాండు, ఢిల్లీ అనిల్, హరికృష్ణ, బూత్ అధ్యక్షులు శేఖర్, మహేశ్, రామకృష్ణ, శ్రీనివాస్‌నాయక్, రాజు నాయక్, సాయి, నరేందర్, అనంత్, మెరుగు మహేశ్ పాల్గొన్నారు.


కందుకూరులో పీఎం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బడంగ్‌పేట్: ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా అసెంబ్లీలో తీర్మానం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మరో అంబేడ్కర్‌లా పొగుడుతూ బుధవారం బడంగ్‌పేట చౌరస్తాలో సీఎం చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్ క్యారగారి శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించగా.. మాజీ మేయర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాతరెడ్డి హాజరై క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పారిజాతతో పాటు దళిత కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెలువడిన కొన్ని గంటల్లోనే తెలంగాణలో ఏబీసీ వర్గీకరణ చేస్తానని మాట ఇచ్చిన సీఎం అనుకున్నట్లుగానే అసెంబ్లీలో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. దండోరా బిడ్డలకు, వెనకబడ్డ జాతులకు సీఎం రేవంత్‌రెడ్డి మరో అభినవ అంబేడ్కర్‌లా మారి మాదిగల కన్నీళ్లను తుడిచారని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బండారి మనోహర్, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సమత, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్ యాదవ్, సీనియర్ నాయకులు బాల్‌నింగని జంగయ్య, ఎర్ర జైహింద్, గట్టు బాలకృష్ణ, పుట్టగళ్ల జగన్, మాదరి శ్రీనివాస్, కుమార్, నిరుడు శ్రీరాములు, ఉమేశ్, గిరి ముదిరాజ్ తదితరులు ఉన్నారు.


బడంగ్‌పేటలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

స్థానిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు: స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధి డీఎల్‌పీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఓటర్ల లిస్టు, ఎన్నికలకు సంబంధించి పలు సలహాలు సూచనలు చేసి మాట్లాడారు. పోలింగ్ బూత్‌లలో కనీస అవసరాలైన విద్యుత్ మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు, ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సిబ్బంది గుర్తింపు, శిక్షణ ఏర్పాట్లు, సెన్సిటీవ్, హైపర్ సెన్సిటీవ్ పోలింగ్ బూత్‌ల గుర్తింపు, వాటి సమర్థ నిర్వహణ గురించి సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ లక్ష్మీనారాయణ, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు ఉన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

ప్రజలను అయోమయానికి గురిచేస్తున్న కేఎల్లార్

- బీజేపీ మండల అధ్యక్షుడు యాదిశ్

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గంపై మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌కు ఏమాత్రం అవగాహన లేకుండా మాట్లాడి ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు టి. యాదిశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేఎల్లార్‌కు మహేశ్వరం నియోజకవర్గంపై ఏమాత్రం అవగాహన లేదని, ఆయన నోటికి వచ్చినట్లు హామీలు ఇచ్చి ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. మహేశ్వరం మండలం మున్సిపాలిటీ అవుతుందని ఉచిత హామీలిచ్చి అది కాకుండా చేశారు. ఇటీవల మహేశ్వరం, కందుకూరు, యాచారం, ఇబ్రాహీంపట్నం మండలాలు కలిసి ఫోర్త్ సిటీ ప్రత్యేక కార్పొరేషన్ అవుతుందని పలుమార్లు ప్రజలకు చెప్పి అయోమయానికి గురి చేసి ఇప్పుడు కార్పొరేషన్ కావడం లేదు, గ్రామ పంచాయతీలుగానే ఉంటాయని అంటున్నారన్నారు. ప్రతిసారి ప్రజలకు అమలుకానీ హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా, కార్యరూపం దాల్చకుండానే ఉంటున్నాయన్నారు. పంచాయతీ ఎన్నికలకు ముందు సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అమలుకానీ హామీలిచ్చి వాటిని అమలు చేయకపోవడంతో ప్రజలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులపై తిరగబడుతున్నారన్నారు. త్వరలో గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

తులం బంగారం హామీ ఏమైంది?

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న తులం బంగారం హామీ ఏమైందని ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రశ్నించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ గోపాల్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కందుకూరు మండలంలో కులగణన సర్వేలో ఏఏ కులంలో ఎంతమంది ఉన్నారని అధికారులను ఆమె అడగగా తమ వద్ద వివరాలు లేవని, ప్రభుత్వానికి సమర్పించామని వారు తెలిపారు. దీనిపై ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పార్టీపరంగా రిజర్వేషన్లు ఇవ్వడం కాదని, ప్రభుత్వపరంగా రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. బీసీలకు 42 శాతం ఇస్తామన్న రిజర్వేషన్లు అమలు చేస్తే ఆ మేరకు ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో సీట్లు వస్తాయన్నారు. సర్వే వివరాలను ఆయా మండలాల్లో అందరి నాయకుల ముందు బహిర్గతం చేస్తే ఏఏ కులంలో ఎంత మంది ఉన్నారు? ప్రభుత్వం ఇచ్చిన వివరాలు సరైనవా కాదా అనేది తేలుతుందన్నారు. జనవరి 26న ఇస్తామన్న రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రుణమాఫీ, మహిళలకు రూ.2500 ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. బూటకపు మాటలతో కాలయాపన చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరిత, బీఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


కందుకూరులో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

క్రీడలతో మానసికోల్లాసం

హుడాకాంప్లెక్స్: విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రీడలను అలవాటు చేసుకుంటే ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం సరూర్‌నగర్ స్టేడియంలో బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్-2025కు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడలను పాఠశాల యాజమాన్యం ప్రోత్సహించాలన్నారు. ఇలాంటి క్రీడలను ఏర్పాటు చేయడంతో విద్యార్థులలో పోటీతత్వం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ డ్రగ్స్ బ్యూరో డీఎస్పీ సుబ్బిరామిరెడ్డి, జిల్లా క్రీడా అధికారి వెంకటేశ్వరరావు, బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి శేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కోశాధికారి నారాయణరెడ్డి, కోశాధికారి శ్రీనివాసరావు, మీసేందర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్గీకరణ కాంగ్రెస్‌తోనే సాధ్యమైంది

పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నర్సింహ

మహేశ్వరం: ఎస్సీ వర్గీకణ అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యమైందని రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నందిగామ నర్సింహ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దళిత, బీసీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణతో 30 ఏళ్ల కల సంపూర్ణంగా సాకారం కాబోతుందన్నారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడుతుందన్నారు. బీసీల కులగణన చేసి ఎవరి వాటా ఎంతో తేల్చి వారికి రిజర్వేషన్లు ఇవ్వనుందన్నారు. రిజర్వేషన్లు అమల్లోకి వచ్చి ఇన్నేళ్లయినా కొన్ని వర్గాల్లో ఇంకా అసమానతలు కొనసాగుతున్నాయన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్, మండల యూత్ అధ్యక్షుడు గొల్లూరు రాజు, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, సీనియర్ నాయకులు చాకలి యాదయ్య, ఆవుల యాదయ్య, అదిల్, లాజర్, శ్రీశైలం, గణేశ్, శ్రీకాంత్, శివ, ప్రవీణ్, పరమేశ్, కుమార్‌యాదవ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.


మహేశ్వరంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బీసీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం


మాట్లాడుతున్న కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి మధు ముదిరాజ్

మహేశ్వరం: బీసీల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పార్టీ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం మండల పరిధి మన్సాన్‌పల్లిలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాహుల్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో బీసీల కులగణన చేశామని, పదేళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలను, ముఖ్యంగా బీసీలను అణగదొక్కిందని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో 34 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించి, వారికి తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఇప్పుడు ఎమ్మెల్సీ కవిత బీసీ రిజర్వేషన్ల కోసం రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించడం బీసీ సమాజం గమనిస్తుందని, అధికారంలో ఉన్నప్పుడు తీరని అన్యాయం చేసిన ఆ పార్టీ.. ఇప్పుడు అదే అంశంపై పోరాటం చేస్తామనడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్‌కు బీసీ కులగణనపై మాట్లాడే హక్కు లేదన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. బీసీల కులగణన, ఎస్సీ వర్గీకరణ అమలు అనేది చారిత్రాత్మకమైందని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొల్లూరు రాజు, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు నడికూడ శివ, యాదగిరి, రాజు, సందీప్, శివ, కుమార్, బాబు, మంద యాదగిరి పలువురు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కలలు సాకారం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: భారత రాజ్యాంగ నిర్మాత కలలు సాకారం చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలుచేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన భావితరాలకు గుర్తుండిపోతుందని కొనియాడారు. ఎస్సీల్లోని 59 కులాలను మూడు గ్రూపులుగా విభజించాలన్న ప్రతిపాదనను శాసనసభ ఆమోదించిందన్నారు. దళితుల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేను పక్కాగా నిర్వహించిందన్నారు. జనాభాకు అనుగుణంగా ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి రాజ్యాంగ సవరణ కోసం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు. కులగణన విషయంలో తీన్మార్ మల్లన్న మాటలు అర్థరహితమన్నారు. సమావేశంలో నాయకులు యాదయ్యయాదవ్, చంద్రశేఖర్, బాదేపల్లి సిద్ధార్థ, బాల్‌రాజ్‌గౌడ్, జగన్, కొమ్ము కృష్ణ, నాగి సాయిలు, కరుణాకర్, శ్రీధర్, జాంగారి రవి, భాస్కర్, అంతయ్య, అనిల్, బస్వం, సీతారాం, మల్లేశ్, సత్తయ్య, జంగయ్య, రవి, భాస్కర్, ప్రభు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు గ్రహణం

- మూడేళ్లుగా సాగుతున్న జాతీయ రహదారి పనులు
- గుంతలమయమైన రోడ్డులో తరచూ ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు

శంషాబాద్ రూరల్: నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే జాతీయ రహదారి విస్తరణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. విస్తరణ కోసం రోడ్డుకు ఇరువైపులా గుంతలు తీశారు. పనులు ఆగిపోవడంతో ఆ గుంతలుకాస్తా వాహనదారులకు ప్రమాదకరంగా తయారయ్యాయి.

- పనులను ప్రారంభించి దాదాపు మూడేళ్లు కావస్తున్నా.. ఓ అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కు అనే చందంగా తయారయ్యా.ఇ ఈ రహదారిపై రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే వాహనదారుల పరిస్థితి గుంతల కారణంగా నరక ప్రాయమవుతోంది.

ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు..

విస్తరణ పనులు పూర్తి కాకపోవడంతో రహదారిపై జరుగుతున్న ప్రమాదాలతో వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు.

- ఘాంసిమియాగూడ సమీపంలో ఏడాదిన్నర కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. తర్వాత జరిగిన ఘటనల్లో సుమారు పది మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. ఇక గాయాలై ఆస్పత్రి పాలైన వాహనదారులు చాలా మంది ఉన్నారు.

ఆరు వరుసలుగా..

శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి నుంచి కొత్తూరు వరకు 12 కిలోమీటర్ల దూరం వరకు ఈ జాతీయ రహదారిని విస్తరిస్తున్నారు. ప్రస్తుతం నాలుగు వరుసలుగా ఉన్న రహదారిని ఆరు వరుసలకు విస్తరించడానికి సుమారు రూ. 540 కోట్లు కేటాయించారు. ఈ పనులను 2022 ఏప్రిల్‌లో కేంద్ర మంత్రి గడ్కరీ ప్రారంభించారు. ఆరంభంలో పనులు జోరుగా సాగినా.. గత ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల సమయం నుంచి పనులు నిలిచిపోయాయి. అడపాదడపా అక్కడక్కడ పనులు చేస్తూ.. కాలం సాగదీస్తున్నారు.

సత్వరమే పూర్తి చేయాలి



అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలి. గుంతల కారణంగా ఈ దారిలో వెళ్లాలంటే భయమేస్తుంది. మూడేళ్లుగా పనులు జరుగుతూనే ఉన్నాయి. ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియడం లేదు. అధికారులు చొరవ తీసుకుని చర్యలు చేపట్టాలి.

– రమేష్, వాహనదారుడు


ఘాంసిమియాగూడ వద్ద పూర్తి చేయని కల్వర్టు పనులు